10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
బుధవారం 23 అక్టోబర్ 2024 పేజీలు 8



దుండిగల్ సర్వే నెం.453, 454 ప్రభుత్వ భూమిలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..

## దుండిగల్ ప్రభుత్వ స్థలాన్ని సందర్శించిన...
# జాయింట్ కలెక్టర్





పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

- పెన్ పవర్ వార్తా కథనానికి స్పందించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి..
- రూ.100 కోట్లు విలువైన.. ప్రభుత్వ భూమిలో గెస్ట్‌హౌస్‌లు అన్న శీర్షికతో వార్తా కథనం..
- తహశీల్దార్ మతీన్, సర్వేయర్‌తో కలిసి అదనపు కలెక్టర్ 453,454 ప్రభుత్వ భూమి పరిశీలన.





**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 22:** ప్రభుత్వ భూమిలో గెస్ట్‌హౌస్ నిర్మాణాలు అన్న శీర్షికతో "పెన్ పవర్" దినపత్రికలో మంగళవారం వచ్చిన వార్తా కథనానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి స్పందించారు.. దుండిగల్ గండిమైసమ్మ మండలం దుండిగల్ గ్రామ శివారు సర్వే నెంబర్ 453, 454లోని ప్రభుత్వ స్థలాన్ని జేసీ విజయేందర్ రెడ్డి మంగళవారం సందర్శించారు.. సర్కారు భూమి ఆక్రమణలో ఉన్న నిర్మాణాలను ఆయన పరిశీలించారు.. దుండిగల్ గండిమైసమ్మ మండల తహశీల్దార్ మతీన్, సర్వేయర్ రూపతో కబ్జాలపై చర్చించారు.. పూర్తి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు.. అయితే దుండిగల్ మండలంలో ఉన్నతాధికారుల సందర్శనలను స్థానిక రెవెన్యూ అధికారులు, మీడియాకు వీలైనంత వరకు గోప్యంగా ఉంచడం పరిపాటిగా మారింది.. దుండిగల్ సర్వే నెంబర్ 323, 453, 454 ప్రభుత్వ భూమిలో గెస్ట్‌హౌస్ నిర్మాణాలపై ఆకుల సతీష్ మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేసినట్లు "పెన్ పవర్" దినపత్రికలో ప్రత్యేక కథనంగా ప్రచురించడంతో..! మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..




## గ్రామంలో ముక్కు ముసుకోవలసిందే..!
### మురికి కాలువలతో కూరుకుపోయిన పైతర గ్రామపంచాయతీ పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు

**పెన్ పవర్, కుల్చారం అక్టోబర్ 22:** నర్సాపూర్ నియోజకవర్గంలోనీ కుల్చారం మండలం పైతర గ్రామపంచాయతీలో ప్రధాన కాలువలు చెత్త చెదారం వ్యర్థపదార్థాలతో నిండిపోతున్నాయి ప్రధాన మురికి కాలువల గుండా చెత్త వ్యర్థ పదార్థాలు కూరుకుపోయి గడ్డి చెట్లు పెరిగిపోయినా.. వాటి వల్ల దోమలు ఎక్కువైనా... పట్టించుకునే నాధుడే కరువయ్యాడు .గ్రామంలో జనాలు టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు. అయినా గ్రామ పంచాయితీ సిబ్బంది అధికారులు పరిశుభ్రత పాటించడంలో అశ్రద్ధ వహిస్తున్నారు. దోమల బెడదను తగ్గించడానికి బ్లీచింగ్ పౌడర్ లాంటి రసానిక పదార్థాలను చల్లడంలో పంచాయతీ అధికారులు రేపు మాపు అంటూ అలసత్వం వహిస్తున్నారు.

గ్రామపంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో గ్రామం మురికి కుపంగా చెత్త మురికి కాలువలతో నిండిపోయి గ్రామం మొత్తం దుర్గంధం, కంపు వాసనలకు నిలయంగా మారింది. మండల ప్రజలు రోగాల బారిన పడడానికి ఆస్కారం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీని పరిశుభ్రత చేపించాలని అధికారులను కోరుతున్నారు.

## కేటీఆర్ ఒక జోకర్..
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్




**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్ అయ్యారు. మంగళవారం (అక్టోబర్ 22) ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ ఒక

-2 లో

# కాంగ్రెస్ కు దొరికేసిన ట్రబుల్ షూటర్



హైదరాబాద్, అక్టోబరు 22, పెన్ పవర్: పీసీసీ చీఫ్ అంటే.. పార్టీకే పరిమితం. కార్యకర్తలు, నేతల సమావేశం..పేరుకే అధ్యక్షుడు అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ మహేశ్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యాక..పదవిని బాధ్యతగా ఫీల్ అవుతున్నారట. ప్రభుత్వ విషయాల్లో జోక్యం చేసుకోకుండా..పార్టీలో సీనియర్లను నొప్పించకుండా వ్యవహారాలను చక్కబెట్టే ప్రయత్నం చేస్తున్నారట.పీసీసీ చీఫ్గా మహేశ్ గౌడ్ చేసిన ఒక ప్రయత్నం.. ప్రతి వారం ఇద్దరు మంత్రులు గాంధీభవన్కు వచ్చేలా చేసింది. సామాన్య కార్యకర్తలు, కిందిస్థాయి నేతలు మంత్రులను కలవడానికి చాలా ఇబ్బంది పడేవారు. గాంధీభవన్కు మంత్రులు వస్తుండటంతో నేరుగా వారిని కలిసి సమస్యలు చెప్పుకుంటున్నారు. దీంతో పార్టీ క్యాడర్కు ప్రభుత్వం దగ్గరైందన్న ఫీలింగ్ కలుగుతుందంటున్నారు హస్తం నేతలు.పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చొరవతో చాలామంది గాంధీభవన్ మెట్లెక్కి సమస్యలు చెప్పుకుంటున్నారు. పార్టీ ఆఫీస్కు వచ్చేవారి విషయంలో కూడా మహేశ్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ.. పరిష్కార మార్గం చూపిస్తున్నారు. జీవో 317తో ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల అంశం విషయంలో పీసీసీ చీఫ్ చొరవ తీసుకొని మంత్రులను గాంధీభవన్కు పిలిచి చర్చలు జరిపేలా చేశారు.అక్టోబర్ 2న జీవో 317కు సంబంధించిన బాధిత ఉద్యోగులు గాంధీభవన్ ముట్టడికి వచ్చారు. కానీ వారిని లోపలికి పిలిచి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలతో చర్చలు జరిపించారు. ఉద్యోగుల ఇబ్బందులను కచ్చితంగా పరిష్కారం చూపుతామని సర్దిచెప్పారు.లేటెస్ట్గా జీవో 29 విషయంలో గ్రూప్-1 అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. కొందరు అభ్యర్థులు గాంధీభవన్ ముట్టడికి వస్తే వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్కు తరలించారు.పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ జోక్యం చేసుకొని వారిని వదలిపెట్టాలని పోలీసులకు సూచించడమే కాకుండా.. గాంధీభవన్కు పిలిచి గ్రూప్-1 అభ్యర్థుల సమస్యలు విన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చి..మంత్రులను స్వయంగా కలిసి జీవో 29పై చర్చలు జరిపారు. ఒక బీసీ బిడ్డగా రిజర్వేషన్ల విషయంలో నష్టం జరిగితే ఊరుకోనని.. ఎలాంటి నష్టం జరగదని భరోసా ఇచ్చారు.ఏ సమస్య వచ్చినా తన భుజాన వేసుకొని పరిష్కారం చూపుతున్నారు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్. ప్రతిపక్షాల విమర్శలను కూడా తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా, మూసీ వంటి విషయంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అండగా ఉంటూ విపక్షాలను ఎండగడుతున్నారు. పైగా ప్రభుత్వానికి..పార్టీకి మధ్య అనుసంధాన కర్తగా వ్యవహరిస్తూ..అన్ని తానై పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు

## కేటీఆర్ ఒక జోకర్.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్

- మొదటి పేజీ తరువాయి

జోకర్ అంటూ సెటైర్లు వేశారు. విద్యుత్ చార్జీల పెంపు అంశంపై కేటీఆర్ ఈఆర్సీ దగ్గరికి వెళ్లడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పేదలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తు చేశారు. మరోవైపు బీజేపీ కీలక నేతలు, కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిని విమర్శించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి తెలంగాణకు చేసిందేమీ లేదని అన్నారు. తెలంగాణకు కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో ఒకే దగ్గర తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ నిర్మిస్తామని తెలిపారు. తద్వారా టైమ్ సేవ్ అవుతోందని పేర్కొన్నారు.

## ఎవరు ఆత్మహత్య చేసుకోవద్దు.. ఇబ్బందుంటే నాకు కాల్ చేయండి: మహిళా కమిషన్ చైర్ పర్సన్ శారద






హైదరాబాద్ పెన్ పవర్:విద్యార్థులు ఎవరు ఆత్మహత్య చేసుకోవద్దని.. కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పెడితే నేరుగా తనకు కాల్ చెయ్యండని తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ల శారద విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ బాచుపల్లిలోని నారాయణ కాలేజీలో ఇటీవల ఇంటర్ విద్యార్థిని అనూష ఆత్మహత్యకు పాల్పడటంతో ఇవాళ (అక్టోబర్ 22) ఆమె కాలేజీకి వెళ్లారు. అనూష మృతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా.. విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై ఆందోళన వ్యక్తం చేసిననేరేళ్ల శారద.. నారాయణ జూనియర్ కళాశాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థిని అనూష ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని అన్నారు. అనూష మృతి నేపథ్యంలో బాచుపల్లి నారాయణ జూనియర్ కళాశాల స్టాఫ్ మొత్తాన్ని మార్చాలని ఆమె ఆదేశించారు. తాను మీడియాతో మాట్లాడుతుండగా వీడియో రికార్డు చేసిన కళాశాల సిబ్బందిపై నేరేళ్ల శారద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైడ్రా ఉద్దేశం వేరే ఉందని నేను చెప్పిన మాటలు ప్రజలు నమ్ముతున్నారు: ఈటల రాజేందర్

### ఫతేనగర్ డివిజన్లో ఎంపీ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్

### ఢిల్లీకి వెళ్లినప్పుడు తప్ప ఎప్పుడూ నియోజకవర్గంలోనే ఉంటున్నానన్న ఈటల

### అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు కోరినట్లు వెల్లడి

### మొదట మూసీ మురికి నీళ్లను శుద్ధి చేయాలని సూచన





హైదరాబాద్ పెన్ పవర్:హైడ్రా ఉద్దేశం వేరే ఉందని, తాను చెప్పిన ఈ మాటలను ప్రజలు ఇప్పటికీ నమ్ముతున్నారని బీజేపీ నేత, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్లోని ఫతేనగర్ డివిజన్లో ఈరోజు బ్రేక్ ఫాస్ట్ మీటింగ్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించి నాలుగు నెలలు దాటిందని, ఈ కాలంలో ఢిల్లీ వెళ్ళినప్పుడు తప్ప ప్రతిరోజు నియోజకవర్గంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. “ఎంత తిరిగినా ఒడవని (తరగని) నియోజకవర్గం ఇది... ఎంత విన్నా ఒడవని (తరగని) గాథ ఉంది ఇక్కడ” అన్నారు. కలెక్టర్ను, హెచ్ఎండిఏ కమిషనర్ను, వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ ఎండిని... ఇలా అందరినీ వివిధ అభివృద్ధి పనులపై కలిశామని, ఎమ్మెల్యేలతో కలిసి అధికారుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. కేంద్రంలో అర్బన్ డెవలప్మెంట్ మంత్రిని కూడా కలిసి స్వచ్ఛ భారత్, స్మార్ట్ సిటీ కింద డబ్బులు కోరినట్లు చెప్పారు. చెరువుల్లోకి మురుగునీరు వెళ్లకుండా... దారి మళ్లించేందుకు గతంలో ‘స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్ కార్యక్రమాన్ని తీసుకు వచ్చారని, ఈ కార్యక్రమానికి కొన్ని నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. మూసీ ప్రక్షాళన విషయం తర్వాత చూసుకోవచ్చు... ముందు మురికి నీళ్లను శుద్ధి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేస్తేనే మూసీ బాగుపడుతుందని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, కానీ చేస్తున్న పద్ధతికి మాత్రం వ్యతిరేకమే అన్నారు. సమస్యలపై తాము కొట్లాడుతున్నప్పుడు ప్రజల సహకారం ఉండాలన్నారు.

# కృష్ణా నదీ తీరంలో దేశంలోనే అతి పెద్ద డ్రోన్ షో... కళ్లు జిగేల్మనిపించిన డ్రోన్ కళాకృతులు

## ఐదు ప్రపంచ రికార్డులతో చరిత్ర సృష్టించిన విజయవాడ డ్రోన్ షో

కేంద్ర పౌరవిమానయాన శాఖ భాగస్వామ్యంతో ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ నిర్వహించిన డ్రోన్ షో విజయవంతం అయింది. డ్రోన్ సమ్మిట్ లో భాగంగా విజయవాడలోని పున్నమి ఘాట్ లో ఏర్పాటు చేసిన ఈ భారీ ఈవెంట్ లో డ్రోన్ విన్యాసాలు అచ్చెరువొందించాయి. ఇక అసలు విషయానికొస్తే... ఈ డ్రోన్ షో ఐదు ప్రపంచ రికార్డులు నమోదు చేసింది. తద్వారా విజయవాడ డ్రోన్ షో చరిత్ర సృష్టించింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు సర్టిఫికెట్లు అందజేశారు. 1. డ్రోన్లను ఉపయోగించి అతి పెద్ద భూగోళం ఆకృతి 2. అతి పెద్ద ల్యాండ్ మార్క్ 3. అతి పెద్ద విమానం 4. అతి పెద్ద జాతీయ జెండా 5. ఏరియల్ లోగో... ఇలా విజయవాడ డ్రోన్ షో ఐదు అంశాల్లో ప్రపంచ రికార్డులు నెలకొల్పింది.





**హైదరాబాద్ పెన్ పవర్:**అమరావతి డ్రోన్ సమ్మిట్ లో భాగంగా విజయవాడ కృష్ణా నదీ తీరంలో నిర్వహించిన దేశంలోనే అతిపెద్ద డ్రోన్ షో కళ్లు జిగేల్మనిపించింది. సాంస్కృతిక కార్యక్రమాలు, లేజర్ షో ముగిశాక... 5 వేలకు పైగా డ్రోన్లు గాల్లోకి లేచాయి. డ్రోన్లు వివిధ కళాకృతులతో అందరినీ అలరించాయి. విమానం, బుద్ధుడు, గ్లోబ్ పై భారతదేశ మ్యాప్, డ్రోన్ కల్చర్, 1911 నాటి పోస్టల్ స్టాంపు, భారత త్రివర్ణ పతాకం... ఇలా వివిధ రూపాల్లో డ్రోన్ లైటింగ్ షో కనులవిందు చేసింది. ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. కాగా, ఈ డ్రోన్ షోను ప్రజలు వీక్షించేందుకు వీలుగా విజయవాడలో ఐదు చోట్ల డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు ఈ భారీ ఈవెంట్ కు హాజరై అత్యంత ఆసక్తితో తిలకించారు. ఈ కార్యక్రమంలో, సీఎం చంద్రబాబు డ్రోన్ హ్యాకథాన్ విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. డ్రోన్ షో సందర్భంగా పున్నమి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 'కృష్ణం వందే జగద్గురుం' కళా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తమ్మీద ఈ డ్రోన్ షో ఏపీ ప్రభుత్వ విజన్ ను చాటేలా, టెక్నాలజీ పట్ల సీఎం చంద్రబాబు అనురక్తిని వెల్లడించేలా సాగింది.

- **ఏపీ రాజధాని అమరావతిలో రెండ్రోజుల పాటు డ్రోన్ సమ్మిట్**
- **సాయంత్రం విజయవాడ పున్నమి ఘాట్ వద్ద డ్రోన్ షో**
- **దేశంలోనే అతి పెద్ద డ్రోన్ షో నిర్వహించిన ఏపీ ప్రభుత్వం**
- **హాజరైన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

# గంగుల కమలాకర్ కు సానుభూతిని తెలిపిన కేసీఆర్

**గంగుల కమలాకర్ కు మాతృవియోగం**


**సంతాపం ప్రకటించిన కేసీఆర్**

**కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపిన బీఆర్ఎస్ అధినేత**



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంగుల కమలాకర్ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తల్లి గుంగుల నర్సమ్మ ఈ ఉదయం కన్నుమూశారు. నర్సమ్మ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరోవైపు గంగుల కమలాకర్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

# తెలంగాణలో మూడు రోజులు వర్షాలు.. 22 జిల్లాలకు ఎల్లో అలర్ట్..



**హైదరాబాద్ పెన్ పవర్:**తూర్పు – మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్ప పీడన ప్రాంతం పశ్చిమ – వాయువ్య దిశగా కదులుతూ అక్టోబర్ 21న ఉదయం అదే ప్రాంతంలో వాయుగుండంగా ఏర్పడింది. ఇది పశ్చిమ – వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి అక్టోబర్ 23 న తుఫాన్ గా ఏర్పడే అవకాశం ఉంది. ఆ తర్వాత ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాన్ని 24వ తేది రాత్రి లేదా 25 న ఉదయం పూరి.. సాగర్ ఐలండ్స్ మధ్య దాటే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో అక్టోబర్ 21,22,23 తేదీల్లో తెలంగాణలోని కొన్ని జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అక్టోబర్ 21న కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కి. మీ. వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు మధ్య దక్షిణ జిల్లాలో అక్కడ అక్కడ కురిసే అవకాశం ఉంది.

**ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్**

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశంతో పాటు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ.

## తిరుపతి జిల్లా చిల్లకూరులో దారుణం.. టీడీపీ నేత సజీవ దహనం

- నిద్రిస్తున్న హరిప్రసాద్‌పై పెట్రోలు పోసి నిప్పంటించిన దుండగులు
- వైసీపీ కార్యకర్తలే ఈ దారుణానికి పాల్పడ్డారని బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణ
- నాంచారంపేటలో ఉద్రిక్తత
- రాజకీయ కక్షలే కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ




**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నాంచారంపేటలో టీడీపీ నేత దారుణహత్యకు గురయ్యారు. ఇంట్లో నిద్రిస్తున్న ఆయనపై దుండగులు పెట్రోలు పోసి నిప్పటించారు. రాజకీయ కక్షలే ఈ ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన టీడీపీ నేత మల్లారపు హరిప్రసాద్ (20) గత రాత్రి తన బంధువు చెలగల కాటయ్యతో కలిసి బయటకు వెళ్లారు. అర్ధరాత్రి తర్వాత ఇంటికి చేరుకున్న ఆయన గాఢ నిద్రలో ఉండగా కొందరు వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వైసీపీకి చెందిన కట్టా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుంపల మధు, ఆయన సహచరులు ఈ దాడికి పాల్పడినట్టు బాధితులు ఆరోపించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కామన్వెల్త్ క్రీడల నుంచి పలు ఆటలు తొలగింపు

- గ్లాస్గో వేదికగా 2026 కామన్వెల్త్ క్రీడలు
- బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, స్క్వాష్, రెజ్లింగ్ తదితర క్రీడల తొలగింపు
- ఈసారి వ్యయాన్ని తగ్గించుకోవాలని 10 ఈవెంట్లు మాత్రమే నిర్వహణ
- ఈ మేరకు కామన్వెల్త్ క్రీడల సమాఖ్య తాజాగా ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:**స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగే 2026 కామన్వెల్త్ క్రీడల నుంచి పలు ఆటలను తొలగిస్తూ కామన్వెల్త్ క్రీడల సమాఖ్య తాజాగా నిర్ణయం తీసుకుంది. బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, స్క్వాష్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, రోడ్ రేసింగ్, నెట్ బాల్, షూటింగ్‌లను తొలగించింది.కాగా, 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో సమాఖ్య 19 ఈవెంట్‌లను నిర్వహించింది. అయితే, ఈసారి వ్యయాన్ని తగ్గించుకోవాలనే ఉద్దేశంతో 10 ఈవెంట్లు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించింది. ఇక 2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుతంగా రాణించిన విషయం తెలిసిందే. భారత్ మొత్తం 61 పతకాలు కొల్లగొట్టింది. ఇందులో 22 గోల్డ్, 16 సిల్వర్, 23 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానం కైవసం చేసుకుంది.

# మంత్రి కొండా సురేఖపై రూ. 100 కోట్ల పరువు నష్టం దావా: కేటీఆర్


- నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దాడులపై పోరాటం చేస్తానన్న కేటీఆర్
- సోషల్ మీడియా ద్వారా తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్య
- నిరాధార ఆరోపణలకు అడ్డూ అదుపూ లేకుండా పోయాయంటూ ఆగ్రహం




**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత దాడులు చేసేవారిపై పోరాటం చేస్తానని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేటీఆర్ తాజాగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ చేశారు. "నా పాత్రపై వ్యక్తిగత దాడులు, నిరాధార ఆరోపణలు చేసేవారిపై తప్పకుండా పోరాటం చేస్తాను. న్యాయ వ్యవస్థపై నాకు నమ్మకం ఉంది. తప్పకుండా నిజం గెలుస్తుందనే విశ్వాసం కూడా ఉంది. మంత్రి కొండా సురేఖ దురుద్దేశపూరితమైన, చౌకబారు వ్యాఖ్యలకు గాను ఆమెపై రూ. 100 కోట్లకు పరువు నష్టం దావా వేశాను. చాలా కాలంగా నిరాధార ఆరోపణలకు అడ్డూ అదుపూ లేకుండా పోయాయి. కొంతకాలంగా సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక నుంచి అలాంటి ఆరోపణలు చేయకుండా కట్టడి చేయాలి. నేను ఎల్లప్పుడూ వ్యక్తిగత విమర్శల కంటే ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తాను. రాజకీయ విమర్శల పేరుతో చౌకబారు ఆరోపణలు చేసేవారికి ఈ వ్యాజ్యం ఒక గుణపాఠం అవుతుందని అనుకుంటున్నాను" అని కేటీఆర్ తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

## తిరుపతి జిల్లా చిల్లకూరులో దారుణం.. టీడీపీ నేత సజీవ దహనం

- నిద్రిస్తున్న హరిప్రసాద్‌పై పెట్రోలు పోసి నిప్పంటించిన దుండగులు
- వైసీపీ కార్యకర్తలే ఈ దారుణానికి పాల్పడ్డారని బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణ
- నాంచారంపేటలో ఉద్రిక్తత
- రాజకీయ కక్షలే కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ




**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం నాంచారంపేటలో టీడీపీ నేత దారుణహత్యకు గురయ్యారు. ఇంట్లో నిద్రిస్తున్న ఆయనపై దుండగులు పెట్రోలు పోసి నిప్పటించారు. రాజకీయ కక్షలే ఈ ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన టీడీపీ నేత మల్లారపు హరిప్రసాద్ (20) గత రాత్రి తన బంధువు చెలగల కాటయ్యతో కలిసి బయటకు వెళ్లారు. అర్ధరాత్రి తర్వాత ఇంటికి చేరుకున్న ఆయన గాఢ నిద్రలో ఉండగా కొందరు వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పంటించారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వైసీపీకి చెందిన కట్టా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో దుంపల మధు, ఆయన సహచరులు ఈ దాడికి పాల్పడినట్టు బాధితులు ఆరోపించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సొంత ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆగ్రహం... స్పందించిన కేటీఆర్

- శాంతిభద్రతల్లేవని అందరూ చెబుతున్న మాటనే జీవన్ రెడ్డి చెప్పారన్న కేటీఆర్
- పూర్తిస్థాయి హోంమంత్రి లేకపోవడం వల్లే శాంతిభద్రతల సమస్య అన్న కేటీఆర్
- సమర్థులైన పోలీస్ అధికారులకు స్వేచ్ఛ ఇస్తారని ఆశిస్తున్నానన్న బీఆర్ఎస్ నేత



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ ప్రభుత్వంలో సొంత కార్యకర్తలకే భరోసా లేదన్న ఆ పార్టీ నేత జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని గత కొన్ని నెలలుగా అందరూ చెబుతున్న మాటనే ఈరోజు కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి చెప్పారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్రానికి పూర్తిస్థాయి హోంమంత్రి లేరని... పోలీసులు రాజకీయ వ్యవహారాల్లో పూర్తిగా బిజీగా ఉండటంతో శాంతిభద్రతల అమలు కుంటుపడిందని ఆరోపించారు. రాజకీయ పెద్దలు ఇకనైనా విజ్ఞతతో ఆలోచిస్తారని అనుకుంటున్నట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలు కాపాడే ప్రాథమిక పనిపై దృష్టి సారించేలా సమర్థులైన పోలీసు అధికారులకు స్వేచ్ఛ ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య నేపథ్యంలో సొంత పార్టీ ప్రభుత్వంపై జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలకే భరోసా లేదన్నారు. తాను ఎవరికీ భరోసా ఇచ్చే స్థితిలో లేనని వాపోయారు.

# ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రిని కలిసిన మోహన్ బాబు, మంచు విష్ణు

- డెహ్రాడూన్ లో పుష్కర్ సింగ్ ధామీని కలిసిన మోహన్ బాబు, మంచు విష్ణు
- ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన సీఎం
- స్టేట్ ఫిల్మ్ పాలసీ గురించి చర్చించామని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని టాలీవుడ్ సీనియర్ నటుడు మోహన్ బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణు నిన్న కలిశారు. డెహ్రాడూన్ లోని ముఖమంత్రి నివాసానికి వీరు వెళ్లారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా పుష్కర్ సింగ్ తెలిపారు. దక్షిణ భారతానికి చెందిన ప్రముఖ నటుడు, సినీ నిర్మాత మోహన్ బాబు, ఆయన కుమారుడు మంచు విష్ణు తన అధికార నివాసంలో తనను కలిశారని పుష్కర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సినీరంగ పాలసీ గురించి తాము చర్చించామని చెప్పారు. మంచు విష్ణు, మోహన్ బాబు నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'కన్నప్ప' త్వరలోనే విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా విడుదలకు ముందు వీరు మన దేశంలోని జ్యోతిర్లింగాలను దర్శించుకుంటున్నారు. కేదార్ నాథ్ తో వీరు జ్యోతిర్లింగాల దర్శనాన్ని ప్రారంభిస్తున్నారు. మోహన్ బాబు, మంచు విష్ణుల జ్యోతిర్లింగాల దర్శనంపై పుష్కర్ సింగ్ స్పందిస్తూ... ఎవరైనా ఒక గొప్ప పనిని చేసే ముందు దేవభూమిని సందర్శిస్తారని చెప్పారు. 'కన్నప్ప' చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. మరోవైపు, వీరి సమావేశం సందర్భంగా ఉత్తరాఖండ్ ఫిల్మ్ డెవలప్ మెంట్ కౌన్సిల్ సీఈవో, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ జనరల్ కూడా అక్కడ ఉన్నారు.

# ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించిన యూట్యూబర్ హర్షసాయి



**హైదరాబాద్ పెన్ పవర్:** నటిపై లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటూ పరారీలో ఉన్న యూట్యూబర్ హర్షసాయి హైకోర్టును ఆశ్రయించాడు. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై నేడు విచారణ జరగనుంది. పోలీసుల కథనం ప్రకారం.. హర్షసాయికి ఓ పార్టీలో ముంబైకి చెందిన నటి పరిచయమయ్యారు. ఆ తర్వాత ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించిన హర్షసాయి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఏకాంతంగా ఉన్న సమయంలో ఫొటోలు తీశాడు. ఆపై వాటిని చూపించి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో నటి పోలీసులను ఆశ్రయించారు. తనపై అత్యాచారానికి పాల్పడడంతోపాటు ఆ ఫొటోలు చూపించి బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాదు, సోషల్ మీడియాలో హర్షసాయి బెట్టింగ్ మాఫియా నడుపుతున్నట్టు ఆరోపించారు. ఆమె ఫిర్యాదు అనంతరం హర్షసాయి పరారయ్యాడు. గత నెల 24న కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో హర్షసాయి తాజాగా ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించాడు. కాగా, బాధిత నటి హర్షసాయితో కలిసి ఓ సినిమాలో నటించడంతోపాటు ఆ సినిమాకు నిర్మాతగానూ వ్యవహరించింది.

# దేశంలోని అన్ని సీఆర్పీఎఫ్ స్కూళ్లకు బాంబు బెదిరింపు... సికింద్రాబాద్ స్కూల్లో తనిఖీలు

- సోమవారం అర్ధరాత్రి మెయిల్ రూపంలో బెదిరింపు
- దేశవ్యాప్తంగా అన్ని స్కూళ్ళలో క్షుణ్ణంగా తనిఖీలు
- సికింద్రాబాద్‌లోని జవహర్ నగర్ సీఆర్పీఎఫ్ స్కూల్లో పోలీసుల తనిఖీలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సహా దేశంలోని అన్ని సీఆర్పీఎఫ్ స్కూళ్లకు సోమవారం అర్ధరాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో బాంబ్ స్క్వాడ్ లతో తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్‌లోని జవహర్ నగర్ పరిధిలోని సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్పీఎఫ్ స్కూళ్లకు మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. బెదిరింపు మెయిల్ వచ్చిన విషయం తెలియగానే జవహర్ నగర్ సీఆర్పీఎఫ్ స్కూల్ వద్దకు చేరుకున్న పోలీసులు విద్యార్థులను, అక్కడున్న వారిని బయటకు పంపించారు. ఘటనాస్థలికి చేరుకున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు, కుషాయిగూడ ఏసీపీ మహేశ్ పరిస్థితిని పరిశీలించారు. అయితే ఈ బెదిరింపు మెయిల్ వట్టిదే అని తేలింది. ఆదివారం నాడు దేశరాజధానిలోని రోహిణిలో సీఆర్పీఎఫ్ స్కూల్ వద్ద పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగిన మరుసటిరోజే దేశవ్యాప్తంగా అన్ని సీఆర్పీఎఫ్ స్కూళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో పోలీసులు, యాజమాన్యం అప్రమత్తమైంది.

## సినీ నిర్మాత శివరామకృష్ణ అరెస్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ సినీ నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ పత్రాలతో 84 ఎకరాల భూమిని కాజేసేందుకు ఆయన ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం... ఆర్కియాలజీ డిపార్ట్ మెంట్ సీనియర్ అసిస్టెంట్ కొత్తిని చంద్రశేఖర్ సాయంతో శివరామకృష్ణ నకిలీ పత్రాలను సృష్టించారు. ఆ తర్వాత బిల్డర్ మారగొని లింగంగౌడ్ సాయంతో ఆ స్థలం తనదేనని చెప్పుకున్నారు. ఈ స్థలం గొడవపై 2003లోనే ఆనాటి ప్రభుత్వం కోర్టులో కేసు వేసింది. ఈ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. కేసును విచారించిన సుప్రీంకోర్టు శివరామకృష్ణవి నకిలీ పత్రాలేనని తేల్చింది. ఈ నేపథ్యంలో శివరామకృష్ణతో పాటు చంద్రశేఖర్, లింగంగౌడ్ పై ఓయూ పోలీసులు కేసు నమోదు చేశారు. శివరామకృష్ణ గతంలో రవితేజతో 'దరువు' సినిమాతో పాటు పలు చిత్రాలను నిర్మించారు.

## ఓ పేషెంట్ గురించి నారా లోకేశ్, కేటీఆర్‌కు తెలంగాణ వ్యక్తి ట్వీట్

### రాజమండ్రిలో అస్వస్థతకు గురైన తెలంగాణవాసి

### కిమ్స్ ఆసుపత్రిలో చేరిక... రూ.1 లక్ష వరకు వైద్యం కోసం ఖర్చు

### మరో రూ.40 వేలు అడుగుతున్నారని.. జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

### వెంటనే స్పందించిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజమండ్రిలో తన స్నేహితురాలి తండ్రి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారని, ఖర్చు విషయంలో జోక్యం చేసుకోవాలని తెలంగాణకు చెందిన ఓ వ్యక్తి ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. అంతేకాదు, మంత్రి కేటీఆర్ కూడా కల్పించుకోవాలని కోరుతూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దీనిని కేటీఆర్ రీట్వీట్ చేశారు. 'హైకొల్లాపూర్' పేరుతో ఉన్న ఎక్స్ హ్యాండిల్ నుంచి 'ఎమర్జెన్సీ' అంటూ ట్వీట్ వచ్చింది. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాకు చెందిన సత్యకృష్ణ అనే వ్యక్తి ఈ నెల 17న రాజమండ్రిలో ఓ పెళ్లికి హాజరయ్యారని, అక్కడే అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారని, రాజమండ్రిలో కిమ్స్ ఆసుపత్రిలో రూ.1 లక్ష వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరో రూ.40,000 ఇస్తే కానీ డిశ్చార్జ్ చేసేది లేదని చెబుతున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని లోకేశ్‌ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. కేటీఆర్ అన్న కూడా కొంచెం రిక్వెస్ట్ చేయండంటూ విజ్ఞప్తి చేశారు. ఈ ట్వీట్‌పై స్పందించిన కేటీఆర్... కిమ్స్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుతామని, అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సాయంత్రానికి 'హైకొల్లాపూర్' మరో ట్వీట్ చేసింది. సమస్య పరిష్కారమైందని, త్వరగా స్పందించి, సమస్యను పరిష్కరించేలా కృషి చేసినందుకు కేటీఆర్‌కు థ్యాంక్స్ అని మరో ట్వీట్ చేశారు.

## జమిలి సరే.. నియోజకవర్గాల పునర్విభజన అడగరేం?!



హైదరాబాద్ పెన్ పవర్:మరో ఏడాదిలో దేశంలో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది. ఈ విషయంలో అన్ని రాష్ట్రాలకు కేం ద్రం ఇప్పటికే సమాచారం కూడా పంపించింది. దీనికి ఏపీకి కూడా రెడీ అవుతోంది. అధికార కూటమి పార్టీలైన టీడీపీ జమిలికి రెడీ అవుతున్నట్టు ప్రకటించింది. ఇక, జనసేన కూడా ఇదే బాటలో నడిచే అవకాశం ఉంది. కానీ, ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు.. ప్రతిపక్షం వైసీపీ కూడా జమిలికి జై కొట్టింది. కాబట్టి.. ఇప్పుడు ఏపీలో ఉన్న అన్ని పార్టీలు జమిలికి జై కొట్టినట్టే.అయితే.. ఇక్కడే ప్రధాన విషయాన్ని పార్టీలు మరిచిపోతున్నాయా? లేక వదిలేశాయా? అన్నది చర్చగా మారింది. రాష్ట్రంలో విభజన తర్వాత.. నియోజకవర్గాల పునర్ విభజన చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని విభజన చట్టంలోనూ పేర్కొన్నారు. ఒక్క ఏపీనే కాకుండా.. తెలంగాణలోనూ పార్లమెంటు, అసెంబ్లీ నియో జకవర్గాలను కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 175 స్థానాలు ఉన్న ఏపీలో నియోజకవర్గాల పునర్ విభజన తర్వాత.. 225 అవుతాయి. అంటే.. 50 నియోజకవర్గాలు పెరుగుతాయి.దీనివల్ల పెరుగుతున్న యువ నాయకులకు టికెట్లు ఇచ్చేందుకు అవకాశం మెండుగా ఉంటుంది. అయి తే.. దీనిని కేంద్రమే చేయాల్సి ఉంది. పార్లమెంటులో ప్రత్యేక బిల్లు పెట్టి.. నియోజకవర్గాలను విభజించా లి. గతంలో చంద్రబాబు 2014-19 మధ్య తరచుగా కేంద్రాన్ని ఈ విషయంపై ఒత్తిడి చేశారు. కానీ, కేంద్రం ఒప్పుకోలేదు. ఇక ఆ తర్వాత వచ్చిన వైసీపీ అసలు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఇప్పుడు ఏకంగా జమిలి దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది.ఈ సమయంలోనే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పునర్విభజన దిశగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి పెంచాలి. లేకపోతే.. కేంద్రం ఏపీలో నియోజకవర్గాలను విభజించే ఆలోచనను పక్కన పెట్టే అవకాశం ఉంది. ఇదే జరిగితే.. పార్టీలలో పెరుగుతున్న నాయకులకు, ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలు సరిపోని పరిస్థితినే రేపు జమిలి వచ్చినా ఎదుర్కొనాలి. కాబట్టి.. ఇప్పటికైనా ఈ విషయంపై మరోసారి కేంద్రానికి లేఖలు రాయడమో.. సమాచారం అందించడమో చేస్తే.. తప్ప ఫలితం లేదు.

## లంచం తీసుకుంటూ.. ఏసీబీకి పట్టుబడ్డ పెబ్బేరు కమిషనర్ ఆదిశేషు

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ లో మరో అవినీతి చేప ఏసీబీ అధికారుల వలకు చిక్కింది. లంచం తీసుకుంటూ వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఏసీబీ అధికారులకు చిక్కా రు. బాధితుడినుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఆదిశేషును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు. మంగళవారం ( అక్టోబర్ 22) పక్కా సమాచారంతో వనస్థలిపురం పరిధిలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కమ్మగూడ రాజరజిత హోమ్స్ లో ఆదిశేషు ఇంట్లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి నుంచి రూ. 20వేలు లంచం తీసుకుంటుండగా ఆదిశేషును ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఈ సోదాలు చేశారు.

# ఉద్యోగులకు ఫ్రీ మీల్స్ వెనుక గూగుల్ సీఈవో సీక్రెట్ వెలుగులోకి..!




హైదరాబాద్ పెన్ పవర్:ఏ సంస్థ అయినా ఉద్యోగులకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో కచ్చితంగా రిటన్ గిఫ్ట్ ఆశించే ఇస్తాయని అంటుంటారు చాలా మంది అనుభవం ఉన్న ఉద్యోగులు. అది తప్పు కూడా కాదు! ఉద్యోగస్తులకు వేలు, లక్షల జీతాలు ఇచ్చే సంస్థలు కచ్చితంగా రిటన్ గిఫ్ట్ ఆశించాలి! ఈ విషయంలో గూగుల్ మరింత వ్యూహాత్మకంగా.. అనే చర్చ తెరపైకి వచ్చింది.అవును.. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తాజాగా "ది డేవిడ్ రూబెన్ స్టెయిన్ షో: పీర్ టు పీర్ కాన్వర్జేషన్" పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతీరోజూ మనం ఆహారం కోసం ఇంత ఖర్చు చేస్తున్నామా.. అనే లెక్కలు తిరిగి పొందే ఉత్పాదకతను ఎలా అంచనా వేస్తారు అనే ప్రశ్నను ఎదుర్కొన్నారు పిచాయ్. దీనికి ఆసక్తికరంగా సమాధానం చెప్పారు.ఇందులో భాగంగా... సంస్థకు సంబంధించిన కేఫ్ లలో జరిగే అనధికారిక చర్చల్లో వినూత్న ఆలోచనలు పుట్టుకొస్తాయని.. ఆ వాతావరణం క్రియేటివ్ ఆలోచనలను పెంచుతుందని.. సొసైటీని నిర్మిస్తుందని పిచాయ్ తెలిపారు. ఈ విధంగా... గూగుల్ ఎంప్లాయిస్ కు అందించే ఉచిత భోజనం సదుపాయం వెనుక అసలు రహస్యాన్ని బయట పెట్టారు.ఇదే సమయంలో తాను గూగుల్ లో మొదట్లో పనిచేసే రోజుల్లో.. కేఫ్ లో ఉన్నప్పుడు ఒకరితో ఒకరు కలుసుకుని మాట్లాడుకున్నప్పుడు ఎంతో ఉత్సాహంగా ఉన్న సందర్భాలు చాలా గుర్తు చేసుకోగలని.. ఇది సృజనాత్మకతను ప్రేరేపిస్తుందని వెల్లడించారు. ఈ విషయంలో సంస్థకు ఖర్చుల కంటే ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయని సుందర్ పిచాయ్ తెలిపారు.కాగా... ప్రస్తుతం 1,82,502 మంది ఉద్యోగులను కలిగి ఉన్న గూగుల్ భారీ ఆఫర్స్ తో మోస్ట్ టాలెంటెడ్ పీపుల్స్ ని ఆకర్షిస్తుంటుంటుంది. ఈ సంస్థలో ఉద్యోగులు.. వెల్ నెస్ ప్రోగ్రామ్స్, ఆన్ సైట్ ఫిట్ నెస్ సెంటర్స్ తో పాటు మెడికల్, విజన్ కవరేజీని కలిగి ఉన్న సమగ్ర హెల్త్ ఇన్సూరెన్స్ ని కూడా ఆనందిస్తుంటారు! అయితే... సుందర్ పిచాయ్ మీల్స్ విషయంలో చెప్పిన లాజిక్ ఈ సౌకర్యాలకు అప్లై చేసుకోవచ్చా లేదా అనేది తెలియాల్సి ఉంది!

# తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో రేర్ సీన్



హైదరాబాద్ పెన్ పవర్:రొటీన్ కు భిన్నమైన సీన్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయాల్లో నెలకొందని చెప్పాలి. కారణం ఏమైనా కానీ తెలుగు రాష్ట్రాల ప్రతిపక్ష నేతలు ఇద్దరు అసెంబ్లీకి హాజరుకాకపోవటం చర్చగా మారింది. తెలంగాణలో రేవంత్ సర్కారు కొలువు తీరి దగ్గర దగ్గర ఏడాది కానుంది. ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి హాజరైన సందర్భం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సాధారణంగా ముఖ్యమంత్రి సభలో ఉండాలని.. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాల్నివినాలని.. సమస్యలకు పరిష్కారాలు చెప్పాలన్న డిమాండ్ తరచూ వినిపిస్తూ ఉంటుంది.అందుకు భిన్నంగా ముఖ్యమంత్రే.. ప్రతిపక్ష నేతను అసెంబ్లీకి రావాలని.. ఆయన చర్చల్లో పాల్గొనాలంటూ తరచూ వ్యాఖ్యలు చేయటం రొటీన్ కు భిన్నం. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ.. విపక్ష నేత కం గులాబీ బాస్ కేసీఆర్ ను అసెంబ్లీకి హాజరు కావాలని కోరటం తెలిసిందే. అసెంబ్లీ వేదికగానే కాదు.. విడి సందర్భాల్లోనూ ప్రధాన ప్రతిపక్ష నేత అసెంబ్లీకి హాజరైతే బాగుంటుందన్న మాటను తరచూ చెప్పటం తెలిసిందే.ఇదిలా ఉంటే.. ఏపీ అసెంబ్లీకి ప్రతిపక్ష నేత (ప్రధాన ప్రతిపక్ష నేతగా జగన్ కు గుర్తింపు లేకపోవటం తెలిసిందే. అసెంబ్లీలో ఉన్న బలానికి అనుగుణంగా ఈ హోదా దక్కలేదు. దీనిపై ఆయన ఇప్పటికే పోరాటం చేస్తున్నారు) జగన్మోహన్ రెడ్డి కూడా అసెంబ్లీకి హాజరు కాకపోవటం తెలిసిందే. త్వరలో జరిగే బడ్జెట్ సమావేశాలకు అయినా అసెంబ్లీకి వస్తారా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇలాంటి వేళ.. ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

అనకాపల్లి జిల్లా పెదగొలుగొండపేట గ్రామంలో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అనూహ్య రీతిలో జగన్ ప్రస్తావన తీసుకొచ్చారు. 'జగన్ అసెంబ్లీకి వచ్చి నాకు నమస్కారం పెడితే చూద్దామని ఉంది. కానీ.. రాలేదు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాలకైనా మాజీ సీఎంజగన్ రావాలి" అంటూ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఇదంతా చూస్తే.. రొటీన్ కు భిన్నంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని విపక్ష నేతలు వ్యవహరిస్తున్నారని చెప్పాలి. తెలంగాణలో విపక్ష నేత రావాలని సీఎం రేవంత్ అదే పనిగా అడుగుతుంటే.. తాజాగా ఏపీలో అసెంబ్లీ స్పీకరే స్వయంగా ప్రతిపక్ష నేత జగన్ అసెంబ్లీకి వస్తే చూడాలని ఉందని చెప్పటం చూస్తే.. ఇదో రేర్ సీన్ గా చెప్పక తప్పదు.

# ఇండియా కూటమి దారెటు..? మిత్రపక్షాలు కాంగ్రెస్‌కు ఎందుకు దూరం అవుతున్నాయి..?

**హైదరాబాద్ పెన్ పవర్:**గత డిసెంబర్ నెలలో ఐదు రాష్ట్రాలకు ఎన్నికల జరిగాయి. ప్రధాన రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఒక్క తెలంగాణలో మాత్రమే గెలుపు సాధించింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లో సంప్రదాయానికి తెరదించి బీజేపీని ఓడించి.. అధికారం చేపట్టాలని కాంగ్రెస్ కలలు కన్నప్పటికీ అది సాధ్యపడలేదు. అటు ఛత్తీగఢ్‌లోనూ కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. మరోవైపు.. రాజస్థాన్‌లో కూడా రెండో సారి గెలిచి తీరాలనుకున్న కాంగ్రెస్‌కు కలలు నెరవేరలేదు.




కేంద్రంలో బీజేపీని గద్దెదించడమే లక్ష్యంగా 28 పార్టీలు ఏకమై ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట కూటమిని ఏర్పాటు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీ ఫైనల్స్‌గా భావించారు. కానీ.. పార్టీలు హోరాహోరీగా ప్రచారాలు చేసినా.. కూటమి పేరు చెబుతూ కాంగ్రెస్ ప్రతీ రాష్ట్రాన్ని చుట్టివచ్చినా చివరకు బొక్కబోర్లా పడక తప్పలేదు. అధికారాన్ని తప్పకుండా చేజిక్కించుకుంటామన్న కూటమి నేతల మాటలు నిజం కాలేదు. దాంతో మూడో సారి ప్రధానమంత్రి పదవిని మోడీనే చేపట్టాల్సి వచ్చింది. హ్యాట్రిక్ విజయంతో కమలం జెండా ఎగురవేశారు.ఆ ఎన్నికల ఫలితాలు అలా ఉంటే.. ఇటీవల జమ్మూకశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. హర్యానాలో రాష్ట్రంలో తప్పకుండా ఇండియా కూటమి విజయం సాధిస్తుందని కాంగ్రెస్ బలంగా నమ్మింది. అటు సర్వేలు సైతం కూటమికి అనుకూలంగానే ఫలితాలు వెల్లడించాయి. ఎగ్జిట్ పోల్స్‌లోనూ అదే విషయం తేటతెల్లమైంది. అటు ఫలితాలు వెల్లడవుతున్న క్రమంలోనూ ముందు కాంగ్రెస్ పార్టీలోనే లీడులో కొనసాగింది. దాంతో ఆ పార్టీ నేతలంతా సంబరాలు చేసుకున్నారు. ఆ తరువాత ట్రెండ్ పూర్తిగా రివర్స్ అయింది. ఎక్కడా కాంగ్రెస్ కూటమి ప్రభావం చూపలేదు. ఫలితంగా అనూహ్యంగా బీజేపీ విజయం సాధించింది. ఇటు జమ్మూకశ్మీర్‌లోనూ కనీసం స్వతంత్రులు సాధించిన సీట్ల సంఖ్య కూడా కాంగ్రెస్ సాధించలేకపోయింది.

గెలుపు ఖాయమనుకున్న హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడం కూటమి నేతలను కలవరపరిచింది. అంతేకాదు.. కూటమిలో చిచ్చుకూడా రేపింది. కాంగ్రెస్ అహంకారం, అతివిశ్వాసం వల్లే ఓడిపోవాల్సి వచ్చిందని మిత్రపక్షాలు దుమ్మెత్తిపోశాయి. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలను కేవలం వాడుకుంటున్నదని ఆరోపించాయి. దీంతో ఇండియా కూటమిలో చీలికలు వచ్చాయి. ఇప్పటికే ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ఆప్ ప్రకటించింది. అతివిశ్వాసంతో ఉన్న కాంగ్రెస్‌పై, అహంకార బీజేపీపై ఒంటరిగా పోటీ చేసి గెలుపొందే సత్తా తమకు ఉందని ఆప్ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ప్రకటించారు. అయితే.. గత పదేళ్లలో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటును కూడా సాధించలేదు. అది కూడా ఆ పార్టీకి మైనస్ అయింది. దాంతోపాటు హర్యానా ఓటమితో తృణమూల్ కాంగ్రెస్ కూడా విమర్శలు చేసింది. కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్న చోట ప్రాంతీయ పార్టీలను కలుపుకోదని, ఆ పార్టీ బలంగా లేని రాష్ట్రాల్లో మాత్రమే కలుపుకుని పోవాలని ఆలోచన అని తృణమూల్ ఎంపీ సాకేత్ గోఖలే విమర్శించారు. మరోవైపు. శివసేన నే సంజయ్ రౌత్ సైతం కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలంటూ సూచించారు.

తాజాగా.. మహారాష్ట్ర, జార ండ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెల్లడైంది. ఈ క్రమంలో ఈ రెండు రాష్ట్రాల్లోనూ గెలిచి తీరాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కానీ.. కూటమి నేతలు ఎవరూ కాంగ్రెస్‌ను విశ్వసించడం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్ మాటను కూడా మిత్ర పక్షాలు పట్టించుకోవడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఇటు.. యూపీలోనూ పది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగబోతున్నాయి. పొత్తులో భాగంగా అధిక స్థానాలను కాంగ్రెస్ కోరుతోంది. కానీ.. సమాజ్‌వాది పార్టీ మాత్రం అందుకు ఒప్పుకోవడంలేదు.ముఖ్యంగా మహారాష్ట్రలో శివసేన కాంగ్రెస్ పట్ల అస్సలు కాంప్రమైజ్ కావడం లేదట. అక్కడి పీసీసీ చీఫ్ నానా పటోలేను కూడా ఆ పార్టీ లెక్కచేయడంలేదట. సొంతంగానే పోటీ చేసేందుకు ఆ పార్టీ ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌తో వెళ్తే అవకాశాలు కోల్పోతామన్న ఆలోచన ఆ పార్టీలో కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక జార ండ్‌కు వచ్చేసరికి తమ పార్టీకి సీట్లు తక్కువగా ఇస్తే సొంతంగా పోటీచేస్తామని ఆర్జేడీ బెదిరిస్తోంది. ఈ క్రమంలో కూటమిలో కాంగ్రెస్ మాట ఏమాత్రం చెల్లుబాటు కావడం లేదన్న అభిప్రాయం స్పష్టం అవుతోంది. దీంతో కాంగ్రెస్ ముందు ముందు ఏం చేయబోతోందా అన్న ఆసక్తి నెలకొంది. మిత్రపక్షాలకు తలొగ్గి వారికి సీట్లు సర్దుబాటు చేస్తుందా..? లేదంటే ఆ పార్టీలు కేటాయించిన సీట్లలోనే పోటీ చేసి సైలెంట్ అవుతుందా..? లేదంటే ఒంటరిగా ఎన్నికలకు వెళ్తుందా అనేది చూడాలి.

# ఈ నెల 23 నుంచి కాళేశ్వరం కమిషన్ ఓపెన్ కోర్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం కమిషన్ రేపటి నుంచి ఓపెన్ కోర్టు నిర్వహించనుంది. ఈ సందర్భంగా పలువురు ఇంజనీర్లను, రిటైర్డు ఇంజనీర్లను, ఉన్నతాధికారులను ప్రశ్నించనుంది. ఈ నెలాఖరు వరకు ఇంజనీర్లు, బ్యూరోక్రాట్ల విచారణ పూర్తి చేయాలనే ఆలోచనలో కాళేశ్వరం కమిషన్ ఉందని తెలుస్తోంది. ఇప్పటికే విచారణ చేసిన ఇంజినీర్లలోనూ పలువురుని కమిషన్ మరోమారు ప్రశ్నించనుంది. ఈ నెల 29వరకు క్రాస్ ఎగ్జామినేషన్ కొనసాగనుంది. కమిషన్‌కు అఫిడవిట్ దాఖలు చేసిన బీఆర్ఎస్ నేత వీ ప్రకాష్‌ను ఈ వారంలోనే బహిరంగ విచారణకు పిలువనుంది. ఈ నెలాఖరులోగా ఎన్డీఎస్ఏ, విజిలెన్స్‌లు తమ ఫైనల్ రిపోర్టులను కమిషన్‌కు అందించనున్నాయి. ఈ క్రమంలో ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్ అధికారులను కూడా కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ చేయనుంది. ఈసారి వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు, అకౌంట్స్ ప్రతినిధులను సైతం కమిషన్ ముందుకు రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. చివరగా ప్రజా ప్రతినిధులను బహిరంగ విచారణకు పిలవాలని కాళేశ్వం కమిషన్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కమిషన్ చీఫ్‌జస్టిస్ పీసీ ఘోష్ ఇవాళ ఇరిగేషన్ అధికారులు, విజిటెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్ ఎడ్డితో సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా ఫైనల్ రిపోర్టు ఇవ్వాలని విజిలెన్స్ డీజీకి కాళేశ్వరం కమిషన్ సూచించింది.

# తెలంగాణలో మత విద్వేషాలు రెచ్చగొట్టడమే ఈటల ధ్యేయం: ఆది శ్రీనివాస్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో మత విద్వేషాలను రెచ్చగొట్టడమే ధ్యేయంగా ఎంపీ ఈటల రాజేందర్ చర్యలు ఉన్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. మొన్నటిదాకా సెక్యులర్ అని చెప్పుకున్న ఈటల.. ఇప్పుడు పూర్తిగా మతతత్వవాదిగా మారాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఈటెల రాజేందర్ అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈర్ష, ద్వేషంతోఈటల రాజేందర్ విమర్శలు చేస్తున్నారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన విష ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో బీజేపీ నేతలు చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఫైర్ అయ్యారు.

సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుళ్లో జరిగిన సంఘటన దురదృష్టకరమని.. ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని గుర్తు చేశారు. ముత్యాలమ్మ ఆలయం ధ్వంసం కేసుపై పూర్తి స్థాయి విచారణ జరుగుతోందని.. రాష్ట్రంలో సామరస్య వాతావరణాన్ని కొనసాగించడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని స్పష్టం చేశారు. ముత్యాలమ్మ ఆలయ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ రాజకీయ ప్రయోజనం కోసం ఈటల రాజేందర్, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

“కాంగ్రెస్ పార్టీది నీచ చరిత్రని ఈటెల రాజేందర్ మాట్లాడుతున్నాడు.. దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిన పార్టీ కాంగ్రెస్.. దేశంలో దశాబ్దాలుగా శాంతి సామరస్యాన్నికాపాడుతున్న పార్టీ.. దేశాన్ని ఐక్యంగా ఉంచడం కోసం ఇందిరా గాంధీ ప్రాణత్యాగం చేశారు..దేశాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లింది కాంగ్రెస్ ప్రధానులు అన్న విషయాన్ని మరిచిపోవద్దు” అని ఈటలకు కౌంటర్ ఇచ్చారు. బీజేపీలా మత విద్వేషాలను రెచ్చగొట్టి కాంగ్రెస్ ఏనాడు రాజకీయాలు చేయలేదని.. మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే గుజరాత్ లో గోద్రా ఘటన జరిగిందన్న విషయాన్ని ఈటల రాజేందర్ మరిచిపోవద్దని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని.. అయినా పట్టించుకోవడం లేదు.. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో మాత్రం చిచ్చుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని బీజేపీ నేతలపై ఫైర్ అయ్యారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ నేతలు రాష్ట్రంలో అలజడులు సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ జూనియర్ లెక్చరర్(జేఎల్) ఫలితాలు విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో జూనియర్ లెక్చరర్ ఫలితాలు విడుదల చేసింది టీజీఎస్‌పీఎస్సీ. ఎంపికైన అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్టును టీజీఎస్ పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https://www.tspsc.gov.inలో ఉంచారు. ఈ పోస్టులకు ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి కాగా..మంగళవారం (అక్టోబర్ 22) సాయంత్రం తుది ఫలితాలను విడుదల చేశారు. 2022లో జేఎల్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. 2023 లో పరీక్షలు నిర్వహించారు. 2024లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. ఇవాళ(మంగళవారం) తుది ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్నారు.

## చిట్ ఫండ్స్ పేరుతో భారీ మోసం..రూ.2.5 కోట్లకు టోకరా




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో చిట్‌ఫండ్ పేరు భారీమోసం వెలుగులోకి వచ్చింది. చిట్టీల పేరుతో కస్టమర్లనుంచి కోట్లలో డబ్బు వసూలు చేసి కనిపించకుండా పోయారు. అనుమానం వచ్చిన కస్టమర్లు ఆరాతీయగా మోసపోయినట్లు తెలుసుకొని లబోదిబో మంటూ పోలీసులను ఆశ్రయించారు. హైదరాబాద్‌లో సోమశేఖర్ పిన్కోడ్ చిట్ ఫండ్స్ పేరుతో రూ. 2కోట్ల 65 లక్షలు వసూలు చేసిన పరారయ్యారు నిందితులు. ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా చిట్ ఫండ్స్ కంపెనీ నడుపుతున్నారు నిందితులు. నెలవారీ చిట్టీల పేరుతో కస్టమర్లనుంచి భారీగా వసూలు చేశారు. ఒక్కో కస్టమర్ల దగ్గర రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షల వరకు వసూలు చేశారు. అయితే ఇటీవల చిట్ ఫండ్ మూసి ఉండటంతో కస్టమర్లకు అనుమానం వచ్చింది. మోసపోయినట్లు తెలుసుకొని పోలీసులను ఆశ్రయించారు. సోమశేఖర్ పిన్ కోడ్ చిట్ ఫోన్స్ పేరుతో రూ. 2కోట్ల 65లక్షలతో ఉడాయించారని సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ప్రధాన నిందితుడు సీతారామయ్యను మంగళవారం ( అక్టోబర్ 22) నందిగామ వద్ద అరెస్ట్ చేశారు.

## మరో విమానానికి బాంబ్ బెదిరింపు కలకలం.. శంషాబాద్ లో ఎమర్జెన్సీ ల్యాండింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో విమానాలకు బాంబ్ బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. గడిచిన వారం రోజుల్లో దాదాపు 80 విమానాలకు బాంబ్ బెదిరింపు కాల్స్, మేసేజ్‌లు రాగా.. తాజాగా మరో విమానానికి బాంబ్ బెదిరింపు కాల్ కలకలం రేపింది. మంగళవారం (అక్టోబర్ 22) ఆకాశ్ ఎయిర్‌లైన్స్ విమానానికి గుర్తు తెలియని నెంబర్ నుండి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. బెంగళూరు నుండి వారణాసి వెళ్తున్న విమానంలో బాంబు ఉందని దుండగుడు కంట్రోల్ రూమ్ కు ఫోన్‌కాల్ చేసి చెప్పడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. వెంటనే విమానాన్ని శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. విమానంలో బాంబ్, ఎలాంటి పేలుడు పదర్థాలు లేకపోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. బాంబ్ ఉందంటూ వచ్చిన ఫోన్ ను ఫేక్ కాల్ గా గుర్తించి.. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హైదరాబాద్‌లో సేఫెస్ట్, కన్వీనెంట్ ప్రయాణానికి ఏదీ బెటర్..Chat GPT ఏం చెబుతుందంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ మహానగరం ఎప్పుడూ బిజీబిజీగా రద్దీగా ఉండే సిటీల్లో ఒకటి.. ఇక్కడ రోజుకు లక్షల్లో ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, స్కూళ్లు కాలేజీల విద్యార్థులు, వ్యాపారాలు చేసుకునేవారు, సిటీనుంచి చూసేందుకు ఇతర ప్రాంతాలనుంచి వచ్చేవారు. ఇలా నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. అయితే హైదరాబాద్‌లో సేఫెస్ట్, కన్వీనెంట్ ప్రయాణానికి ఏదీ బెటర్..బస్సులా..? క్యాబ్ లా..? ఆటోలా..? లేక ఎంఎంటీఎస్ రైళ్లా..? లేక హైదరాబాద్ మెట్రోనా.. అంటే కొంచెం ఆలోచించాల్సిన విషయమే..

%హైదరాబాద్ మహానగరంలో ఒకచోటి నుంచి మరోచోటికి ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, క్యాబ్ లు, మెట్రో ట్రైన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే ఏదీ సురక్షిత ప్రయాణాన్ని అందిస్తుందనేది పెద్ద క్వశ్చన్ మార్క్. అయితే ఇటీవల అందుబాటులో వచ్చిన %జష్ట్రు ఉ్రు% మాత్రం.. హైదరాబాద్ నగరంలో అత్యంత సౌకర్యవంతమైన, సురక్షితమైన రవాణా ఏదీ అని అడిగినప్పుడు ఆసక్తికర విషయాలను చెబుతోంది. అదే ఎల్ అండ్ టీ, రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హైదరాబాద్ మెట్రో ప్రయాణానికి చాలా సురక్షితం అని చూపెడుతోంది. “హైదరాబాద్ లో అంత్యంత సౌకర్యవంతమైన, సురక్షఇతమైన రవాణావిధానం అటే.. అది హైదరాబాద్ మెట్రో.. వేగవంతమైనది, నమ్మదగినది, పర్యావరణానికి అనుకూలమైనది.. ఇది మీ రోజువారీ ప్రయాణానికి తగినది అని ”ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్ ట్విట్టర్ లో ఆసక్తికర పోస్ట్ పెట్టింది. “ఈరోజే స్మార్ట్ మూవ్ చేయండి..అతుకులు లేని ప్రయాణం కోసం మాతో కలిసి ప్రయాణించండి.. హైదరాబాద్ లో సేఫెస్ట్, కంఫర్టబుల్ ప్రయాణం ఏదీ అంటే ఓన్లీ ఒన్.. హైదరాబాద్ మెట్రో అని చెబుతూనే కింద ఓ హెచ్చరిక కూడా ఇచ్చింది. ఇది మేం గానీ మా సిబ్బందిగా చెబుతున్న విషయం కాదు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ % లో అడగండి ”..ఇదే చెబుతోందని రాశారు. జంట నగరంలో అత్యంత వేగవంతమైన రవాణా మార్గంగా హైదరాబాద్ మెట్రో ఒకటి. ప్రస్తుతం మూడు రూట్‌లు ఉన్నాయి. ఒకటి ఎల్‌బి నగర్ నుండి మియాపూర్ వరకు, రెండవది నాగోల్ నుండి రాయదుర్గం వరకు మరియు మూడవది పరేడ్ గ్రౌండ్స్ నుండి ఎంజి బస్ స్టేషన్ వరకు మెట్రోసేవలు అందుబాటులో ఉన్నాయి. ఏ మార్గంలోనైనా సౌకర్యవంతమైన ప్రయాణం. స్టేషన్లు బాగా నిర్వహించబడుతున్నాయి. పీక్ అవర్స్‌లో క్యూలను నివారించేందుకు, ప్రతి ప్రయాణంపై 10శాలం తగ్గింపును అందించే మెట్రో కార్డ్‌ని తీసుకోవచ్చు.మెట్రో రైళ్లు టైం నడుస్తున్నాయి. ఎటువంటి ట్రాఫిక్ లేనిది. ప్రతి మెట్రో స్టేషన్‌లో స్టేషన్‌కు ఇరువైపులా లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు , మెట్లు ఏర్పాటు చేయబడ్డాయి. సీనియర్ సిటిజన్ల ప్రయోజనాల కోసం ప్రత్యేక సీట్లు అందించబడ్డాయి ఒక బోగీ మహిళలకు రిజర్వ్ చేయడం ద్వారా అత్యంత సౌకర్యంవంతంగా సేఫ్ గా ప్రయాణించేందుకు ఎల్ అండ్ టీ ఏర్పాట్లు చేసింది.

# విద్యార్థులూ..ఫుట్‌బోర్డు ప్రయాణం వద్దు..ప్రాణాలకే ప్రమాదం: టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థుల ఫుట్ బోర్డు ప్రయాణంపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. ఇటీవల TGSRTC కి చెందిన బస్సుల్లో కొందరు విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయానం చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియా ద్వారా యాజమాన్యం దృష్టికి రావడంతో విద్యార్థులకు హెచ్చరికలు చేస్తూ ఎండీ సజ్జనార్ ట్వీట్ చేశారు. TGSRTC కి చెందిన ఒక బస్సులో కొందరు విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తోన్న దృశ్యాలు సోషల్ మీడియా ద్వారా యాజమాన్యం దృష్టికి వచ్చాయి. రాష్ట్రంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. రద్దీకి అనుగుణంగా బస్సులను ఎప్పటికప్పుడు ఆర్టీసీ అధికారులు%రాష్ట్రంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. రద్దీకి అనుగుణంగా బస్సులను ఎప్పటికప్పుడు ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. అయినా కొన్ని రూట్లలో విద్యార్థుల రద్దీ వీపరీతంగా ఉంటున్నారు. విద్యార్థులు ఫుడ్ బోర్డు ప్రయాణం చేస్తున్నారు. ఇది మంచిది కాదు.. ప్రాణాలకే ప్రమాదం.. ఫుట్ బోర్డు ప్రయాణం చేయొద్దని విద్యార్థులరు హెచ్చరించారు ఎండీ సజ్జనార్. రద్దీ ఎక్కువగా ఉండే ఆయా రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించాం.. ఆ దిశగా చర్యలు కూడా చేపట్టాం. విద్యార్థులను క్షేమం గా గమ్యస్థానాలకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు ఎండీ సజ్జనార్.

ప్రతిరోజు లక్షలాది మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే గమ్యస్థానాలకు చేరుతున్నారు. విద్యార్థులకు రవాణ పరంగా ఇబ్బందుల్లేకుండా తగినన్ని బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి అవాంఛనీయ ప్రమాదాలు జరగకుండా ఫుట్ బోర్డు ప్రయాణం చేయొద్దని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ.. విద్యార్థులకు సూచించారు.